## తిమ్మాపురంలో మంచినీటి కోసం ధర్నా

అర్వపల్లి, ఏప్రిల్ 9 : 10 రోజులుగా మంచి నీళ్లు రావడం లేదని ప్రజలు మండలంలోని తిమ్మాపురం ఎక్స్ రోడ్ వద్ద పండుగ పూట మంగళవారం సూర్యాపేట - జనగాం జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అధికారులు వెంటనే స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు.



తిమ్మాపురంలో జనగాం - సూర్యాపేట జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ప్రజలు



సూర్యాపేటలో కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పచ్చడి చేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# టాప్ గేర్‌లో 'కారు'

## ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ జోరు

- ప్రజల్లోకి దూసుకెళ్తున్న అభ్యర్థి క్యామ మల్లేశ్
- నియోజకవర్గ సన్నాహక సమావేశాలతో దూకుడుగా..
- నేతలతో సమన్వయం.. నిత్యం ప్రజలతో మమేకం
- కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను వివరిస్తున్న గులాబీ పార్టీ
- కేడర్‌లో ఫుల్ జోష్.. జనంలో మస్త్ ఆదరణ
- బీఆర్‌ఎస్‌కు జై కొడుతున్న సబ్బండ వర్గాలు







యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : ప్రజా సంగ్రామంలో బీఆర్ఎస్ పార్టీ దూసుకెళ్తున్నది. ఎలక్షన్ ప్రచారంలో జోరు పెంచింది. ఇతర పార్టీలకు భిన్నంగా అందనంత దూరంగా దూకుడు ప్రదర్శిస్తున్నది. బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నేతలను సమన్వయం చేసుకుంటూనే, నిత్యం పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ సన్నాహక సమావేశాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎండగడుతున్నారు.

### నిత్యం జనం మధ్యే..

పార్లమెంట్ ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. దాంతో జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంది. రాజకీయాల్లో అనుభవజ్ఞుడైన క్యామ మల్లేశ్ దూకుడుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. అన్ని వర్గాలను కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. జోరుగా ప్రచారం చేస్తున్నారు. టికెట్ ఖరారైనప్పటి నుంచి జన బాహుళ్యంలోనే ఉంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్‌లోని ముఖ్య నేతలను అందరినీ ఇప్పటికే కలిసి సమన్వయం చేసుకుంటున్నారు. కేడర్‌కు సైతం నిత్యం అందుబాటులో ఉంటున్నారు. మేధావులను కలిసి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. జనం మధ్యలోనే ఉంటూ సమస్యలను వినే ప్రయత్నం చేస్తున్నారు. స్థానికంగా పల్లెల్లో పర్యటిస్తున్నారు. సమావేశాల్లో తనదైన శైలిలో పంచ్‌లు, ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యర్థులకు అంతుపట్టకుండా గెలుపు కోసం అంతర్గతంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఎంపీ సీటు గెలిపించి, కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని సంకల్పంతో ముందుకెళ్తున్నారు.

### జోరుగా సన్నాహక సమావేశాలు

బీఆర్‌ఎస్ పార్టీ ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నది. ప్రత్యర్థి పార్టీలకు భిన్నంగా జనంలోకి వెళ్తున్నది. పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నది. వీటి బాధ్యత ఆయా అసెంబ్లీల మాజీ ఎమ్మెల్యేలకు అప్పగించింది. వారే అన్నీ తామై పర్యవేక్షిస్తున్నారు. తొలుత పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఏడు నియోజకవర్గాల్లో ఏడు సమావేశాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే తుంగతుర్తి, మునుగోడు నియోజకవర్గాల్లో విజయవంతంగా సమావేశాలు ముగిశాయి. సుమారు 3వేల మందితో సభలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 13న ఆలేరు, నకిరేకల్, 15న భువనగిరిలో నియోజకవర్గ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు.

### కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలపై ఫోకస్

ఎన్నికల కోసం సన్నాహక సమావేశాల్లో కేడర్‌ను సంసిద్ధులను చేస్తున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం, ప్రభుత్వంలోకి వచ్చాక హామీలు అమలు చేయకపోవడంపై శ్రేణులను చైతన్యం చేస్తున్నారు. గతంలో రేవంత్ రెడ్డి, ప్రియాంక గాంధీ, భట్టి విక్రమార్క ఇచ్చిన హామీల వీడియోలను సభల్లోనే ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి.. ఆ పార్టీ మోసాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ను ఎందుకు గెలిపించాలి..? కాంగ్రెస్ గెలిస్తే కలిగే నష్టాలను వివరిస్తున్నారు. అంతేకాకుండా పదేండ్లలో బీజేపీ చేసిన మేలు ఏం లేదని, గెలిచిపించినా ఏం చేయబోరని తెలియజేస్తున్నారు.



భువనగిరిలో సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు(ఫైల్)

### రైతు సమస్యలపై పోరాడుతూనే..

బీఆర్‌ఎస్.. ఎన్నికల్లో జోరు ప్రదర్శిస్తూనే.. రైతు సమస్యలపైనా పోరాటం చేస్తున్నది. ఆపత్కాలంలో అన్నదాతకు అండగా నిలుస్తున్నది. కాంగ్రెస్ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. అంతే కాకుండా రైతు బంధు, రైతు రుణమాఫీ పత్తాలేకుండా పోయాయి. కర్షకులకు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వడంతోపాటు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. కానీ రైతులు కష్ట కాలంలో ఉన్నా కనీసం పట్టించుకోవడంలేదు. దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్‌పై రణభేరీ మోగించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసింది. కలెక్టర్లకు వినతి పత్రాలు అందించింది. శాంతియుతంగా నిరసన దీక్షలకు దిగింది. రైతులకు మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నది.

### బీఆర్‌ఎస్ వైపే అన్ని వర్గాలు

బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్నది. బీసీ సామాజిక వర్గం కావడంతో ఆయనకు మరింత కలిసివస్తున్నది. వివాద రహితుడు, అవినీతికి దూరంగా ఉండే, మచ్చలేని మనిషి, ప్రజల బాధలు తెలిసిన వ్యక్తి కావడంతో జనం నుంచి మంచి స్పందన వస్తున్నది. ఇటీవల మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి సైతం క్యామ మల్లేశ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. బీసీలతోపాటు అన్ని వర్గాలు గెలిపిస్తామంటూ మద్దతు తెలుపుతున్నారు. భువనగిరిలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు క్యామ మల్లేశ్ చురుగ్గా వ్యవహరిస్తుండటంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

### కాంగ్రెస్, బీజేపీ డీలా..

బీఆర్‌ఎస్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తుంటే.. ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మాత్రం డీలా పడుతున్నాయి. ప్రచారంలో ఆ పార్టీలు ఎక్కడా కనిపించడం లేదు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అంతర్గత పంచాయితీలను సరిచేసుకోవడానికే నానా తంటాలు పడుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. అసలు ఆయన ఎవరికీ తెలియదని, ప్రచారానికి కూడా రాకపోతే ఓటెవరేస్తారని ఆ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ సైతం ప్రచారంలో మమ అనిపిస్తున్నారు.

## ఇంటింటా ఉగాది సంబురాలు

- క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు
- షడ్రుచుల ఉగాది పచ్చడి ఆస్వాదం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం

రామగిరి, ఏప్రిల్ 9 : శ్రీ క్రోధి తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఇంటి గుమ్మాలకు మామిడి, వేప తోరణాలు కట్టి నవ వసంతం మాదిరిగా తమ కుటుంబం పచ్చగా, సంతోషంగా ఉండాలని పూజలు నిర్వహించారు. ఇంటిల్లిపాది పిండి వంటలతోపాటు షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. పలు చోట్ల జరిగిన కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ రాశుల వివరాలను తెలుసుకున్నారు. సూర్యాపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఉగాది పండుగను జరుపుకొన్నారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో సెల్ఫీ దిగుతున్న యువతులు



నల్లగొండలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, తదితరులు



కూరెళ్ల విఠలాచార్యను సన్మానిస్తున్న కవులు, సాహితీ వేత్తలు

## జిల్లా సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు అవసరం

- పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య
- సాహితీమేఖల ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం, పురస్కారాల ప్రదానోత్సవం

రామగిరి, ఏప్రిల్ 9 : నల్లగొండ జిల్లా కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు పుట్టినిల్లు అని ప్రముఖ సాహితీవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య అన్నారు. జిల్లా సాహిత్యం, కవిత్వంపై ఇంకా పరిశోధనలు అవసరమని, ఆ దిశగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా సాహితీమేఖల సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో మంగళవారం కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట నీలగిరి కవుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా సాహిత్యం, కవిత్వంపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితిలో పున్న అంజయ్య కవుల చరిత్ర రాయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ కవి మేరెడ్డి యాదగిరి రెడ్డి అధ్యక్షతన ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారికి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ కవులు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలన్నారు. పురస్కారాలు అందుకున్న వారిలో సుందర దేశికుల్, మునాస్ వెంకట్, భూతం ముత్యాలు, సైకిబాబా, రావిరాల నర్సయ్య, పెన్నా మోహనశర్మ, కొండోజు నవీన్‌కుమార్, చిన్నారి గుర్రం వేఘన ఉన్నారు. కార్యక్రమంలో జాతీయ సినిమా విమర్శ అవార్డు గ్రహీత ఎం.పురుషోత్తమాచార్యులు, సాహితీ మేఖల సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య, చండూరు సాహితీ మేఖల వ్యవహారకర్త మంచుకొండ చిన భిక్షమయ్య, గండూరి లక్ష్మీనారాయణ, బైరెడ్డి కృష్ణారెడ్డి, అద్దంకి లక్ష్మయ్య, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## సూర్యాపేట మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 9 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 11, 12 తేదీల్లో సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా గురువారం, శుక్రవారం సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. 13న మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సెలవు రోజుల్లో మార్కెట్‌కు ధాన్యం తీసుకురావద్దని సూచించారు. కమీషన్‌దారులు, వ్యాపారులు ఈ విషయాన్ని రైతులకు తెలిపి సహకరించాల్సిందిగా కోరారు.

# అరకొరగా ధాన్యం కొనుగోళ్లు

- కేంద్రాలు ప్రారంభించినా అన్ని చోట్లా సాగట్లే..
- నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 36,596 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు
- గన్నీ బ్యాగుల కొరతతో తప్పని ఇక్కట్లు
- వర్ష సూచనతో రైతుల ఆందోళన



నల్లగొండ మండలం రెడ్డి కాలనీ గ్రామంలో కొనుగోళ్లు లేక పేరుకుపోయిన ధాన్యం

నల్లగొండ, ఏప్రిల్ 9 : యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ అరకొరగా సాగుతున్నది. దాదాపు అన్ని చోట్లా కేంద్రాలు ప్రారంభమైనా కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయి. ఈ నెల 1న కేంద్రాలు అధికారికంగా మొదలైనా చాలాచోట్ల ఆలస్యంగా అందుబాటులోకి వచ్చాయి. ధాన్యాన్ని కల్లాల్లో పోసి రైతులు ఎదురు చూస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనాకు ఇప్పటి వరకు 36,596 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. గన్నీ బ్యాగుల కొరత కూడా అక్కడక్కడ ఉత్పన్నమవుతున్నది. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని, కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు కూడా ఎప్పటికప్పుడే జరిగేలా చూస్తున్నామని నల్లగొండ సివిల్ సప్లై డీఎం నాగేశ్వర్‌రావు తెలిపారు. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోనూ ధాన్యం కొనుగోళ్లు అరకొరగానే జరుగుతున్నాయి. ప్రస్తుతం వర్ష సూచన నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం క్వింటా ధాన్యానికి సాధారణ రకం అయితే రూ.2183, గ్రేడ్-1కు రూ.2,203గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఎన్నికల హామీల్లో క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినందున ఈ సారి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### సాగర్ నియోజకవర్గంలో 15 కేంద్రాలే..

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 15 మాత్రమే ప్రారంభమయ్యాయి.

### రెడ్డి కాలనీలో ప్రారంభం కాని కొనుగోళ్లు

- రెండు సొసైటీ మధ్య గొడవతో రైతుల ఇబ్బందులు

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని రెడ్డి కాలనీ గ్రామంలో ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. 100కు పైగా ధాన్యం రాశులు పోసి కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే చందనపల్లికి చెందిన కొందరు రైతులు జైకిసాన్ సొసైటీగా ఏర్పాటై రెడ్డి కాలనీలో ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇతర గ్రామానికి చెందిన మీరెలా కొనుగోలు చేస్తారని, తామే సొసైటీగా ఏర్పడి కొనుగోళ్లు చేస్తామని రెడ్డి కాలనీ వాసులు అంటున్నారు. ఇలా రెండు సొసైటీల గొడవతో సెంటర్‌లో ధాన్యం కొనుగోళ్లు జరుగడం లేదు. ఈ సెంటర్‌లో సుమారు 25 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టే అవకాశం ఉన్నది. వర్షం, గాలి దుమారంతో ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పేరుకే కొనుగోలు కేంద్రాలు పెట్టిండ్రు



ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయడం వల్ల రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తున్నది. దాంతో సరైన ధర రాక రైతులు నష్టపోతున్నారు. వడ్ల కుప్పలతో కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే నిండి పోయాయి. వడ్లు పోసిన రైతులు ఎప్పుడు కొంటరా అని ఎదురు చూస్తున్నరు. పీఏసీఎస్ వాళ్లు పేరుకే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిండ్రు. అసలు కొనడం లేదు. నేను కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి వారం రోజులు దాటింది. అధికారులు వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

*- శ్రీరాముల నాగరాజు, రైతు, పాచిల్ల గ్రామం, గుండాల మండలం*

### 15 రోజుల నుంచి ఎదురు చూస్తున్నం



మేము గుండాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి 15 రోజులు దాటింది. నేటికీ అధికారులు కొనుగోళ్లు ప్రారంభిస్తలేరు. పీఏసీఎస్ వారు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వదిలేసిండ్రు. రోజూ వడ్లను ఎండపోయడం, కుప్ప చేయడం ఇదే పని అవుతుంది కానీ కొనుగోలు చేస్తలేరు. ఎంతో కష్టపడి వడ్లను పండించిన రైతుకు ధాన్యం అమ్ముకోవడం మరింత కష్టమైతాంది. అకాల వర్షాలు వస్తే రైతుల పరిస్థితి ఆగమే. అధికారులు ధాన్యం కొనుగోళ్లను వెంటనే పారంభించాలి.

*-బండి విజయ, మహిళా రైతు, గుండాల, యాదాద్రి భువనగిరి జిల్లా*

## చికిత్స పొందుతూ మరో చిన్నారి మృతి

- ఆటో ప్రమాదంలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 9 : ఈ నెల 4న జిల్లా కేంద్రం శివారులో మానసనగర్ వద్ద జాతీయ రహదారి 65పై ఆటోను కారు ఢీ కొట్టిన ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలు, మరో ఏడుగురికి స్వల్పగాయాలైన విషయం విదితమే. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కలకొట్ల లావణ్య ఈ నెల 7న మృతి చెందింది. గొలుసు మోక్షిత్ (7) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన గొలుసు వేదశ్విని, గొలుసు మోక్షిత్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



ఆటో ప్రమాదంలో మృతి చెందిన అన్నా చెల్లెలు మోక్షిత్, వేదశ్విని (ఫైల్)



కోదాడ : ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

## బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ, ఏప్రిల్ 9 : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి గత కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని రోషమ్మ వీధిలో ముస్లింలకు షాకీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభు త్వం ముస్లింలకు రంజాన్ తోఫా అందించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అటువంటి సంప్రదాయాలను పాటించకపోవడం దురదృష్టకరమని అన్నారు. సమాజానికి ఉపయోగపడే మహ్మద్ ప్రవక్త బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సమాజం బాగుండాలని, ప్రకృతి కరుణించాలని, ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నాయకుడు నయీం, కౌన్సిలర్లు షఫీ, ఫాతిమా, ఖాజా, పార్టీ నాయకురాళ్లు పిట్టల భాగ్యమ్మ, మైనార్టీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.